

ఐద్వా పోరాటాలకు సంపూర్ణ మద్దతు

సౌహార్ద్ర సందేశంలో ప్రజా, రైతు, కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో మహిళల హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐద్వా చేపట్టబోయే భవిష్యత్ పోరాటాలకు తమ వంతు సంపూర్ణ మద్దతు ఇస్తూ ప్రత్యక్ష్యంగా పోరాటాల్లో పాల్గొంటామని ప్రజా, రైతు, కార్మిక సంఘాల నేతలు తెలియజేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా అనంతపురం నగరంలోని ఎంకెఎం ఫంక్షన్ హాల్ రబియాబి వేదికలో నిర్వహించిన ప్రతినిధుల మహాసభల్లో రైతు, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఆవాజ్ నేతలు హాజరై సౌహార్ద సందేశం విన్పించారు.

వ్యవసాయం లాభసాటి కోసం రైతాంగాన్ని ఆదుకోవాలి

రాష్ట్రంలో వ్యవసాయం రంగంపై ఆధారపడి ఎక్కువ మంది జీవిస్తున్నారు. పెట్టిన పంటకు గిట్టుబాటు ధరలు లేకుండా పోయాయి. గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వ్యవసాయాన్ని లాభాసాటిగా మార్చడానికి రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమతో ప్రజలు సమాజానికి తోడ్పాడు అందిస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. స్థానిక పాడి రైతులను ప్రోత్సహించేలా స్థానిక సొసైటీలకు సహకారం అందించాలి.

హేమలత, రైతు సంఘం రాష్ట్ర నాయకురాలు.

వ్యవసాయ కార్మికుల సంక్షేమ చట్టం అవసరం

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు ఇంటిలోనూ వ్యవసాయంలోనూ సగభాగంగా సేవలందిస్తున్నారు. మహిళలకు సమాన హక్కులు అమలులో మాత్రం వ్యత్యాసం ఉంది. రాష్ట్రంలో అత్యధిక మంది మహిళలు వ్యవసాయం తరువాత ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉపాధి పనులు పూర్తిస్థాయిలో కల్పించడం లేదు. కనీస సౌకర్యాలు తాగునీరు, నీడ, వైద్య మందులు తదితరం ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రావడం లేదు. ఉపాధి భద్రత కల్పించేలా వ్యవసాయ కార్మికులకు సంక్షేమ చట్టం తీసుకురావాలి.

శివనాగరాణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి

మహిళలు అన్ని రంగాల్లో పని చేస్తున్నా వీరికి సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదు. పని ప్రదేశాల్లో మహిళలు హింసకు గురవుతున్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా దాడులు, హత్యలు ఆగడం లేదు. ప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. మహిళలకు రక్షణ చర్యలు తీసుకోవాలి. ఐద్వా పోరాటాలకు సిఐటియు సంపూర్ణంగా నిలిచి పోరాడుతుంది.

రమాదేవి, సిఐటియు రాష్ట్ర నాయకురాలు.

దళితులు, మైనార్టీలపై దాడులు నిర్మూలించాలి

సమాజంలో దళితులు, మైనార్టీలపై దాడులు హత్యలు చోటు చేసుకోవడం దుర్మార్గంగా ఉంది. ప్రభుత్వాలు దళిత పక్షపాతిగా పరిపాలన చేస్తున్నారే తప్పా ఆచరణలో హత్యలు దాడులను మాత్రం నివారించలేకపోతున్నారు. ఇలాంటి చర్యలు సమాజానికి ప్రమాదకరం ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా దాడులు మాత్రం ఆగడం లేదు. దాడులు నిర్మూనకు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది.

ఓ.నల్లప్ప, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు.

ఇంటి నుంచే సమానత్వం ప్రారంభించాలి

మహిళలు, పురుషులన్న లింగ భేదం లేకుండా మన ఇంటి నుంచే సమానత్వం ప్రారంభం కావాలి. అన్ని రంగాలు, సంఘాలలో సభ్యత్వం కల్పిస్తూ సమాజ మార్పునకు సేవలు అందిస్తున్నా వివక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ వివక్షను రూపుమాపాలి. సంఘాలుగా ప్రభుత్వాలను కదలించేందుకు మహిళా సంఘాలు చేపట్టే పోరాటాలకు ఆవాజ్ మద్దతు ఇస్తుంది. ఆవాజ్‌లోనూ మహిళా ప్రతినిధులు తయారు చేసి, వారి హక్కుల సాధనకు పోరాటాలు చేస్తాం.

మహమ్మద్ అబ్దుల్లా చిస్తి, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.



2వ రోజు మహాసభ సందర్భంగా ప్రసంగిస్తున్న ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే

'మహిళల స్థితిగతుల్లో మార్పులేదు'..!

ప్రపంచ వ్యాప్తంగా మహిళల స్థితిగతుల్లో ఎటువంటి మార్పూ ఉండకపోగా మరింత దిగజారుతోందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలోని ఎంకెఎం ఫంక్షన్ హాలులో 16వ ఐద్వా రాష్ట్ర మహాసభ సోమవారం నుంచి ఆరంభమైంది. మంగళవారం రెండో రోజు మహాసభలో సుదీర్ఘ చర్చలు జరిగాయి. ప్రజా, కార్మిక, రైతు సంఘాలు సౌహార్ద్ర సందేశాన్ని విన్పించారు. మహిళల గొప్పతనాన్ని తెలియజేస్తూ రచించిన 'ఎక్కడమ్మా నీవులేనిది' పుస్తకావిష్కరణ చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 'అమ్మకు పట్టాభిషేకం' పేరుతో ప్రదర్శించిన నాటికి ఆకట్టుకుంది.



2వ రోజు జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ప్రతినిధులు

- ◆ ప్రపంచవ్యాప్తంగా 19 మిలియన్ బాలికలు విద్యకు దూరం
- ◆ చట్టసభల్లోనూ తగ్గుతున్న ప్రాధాన్యత
- ◆ ఐద్వా మహాసభలో సుదీర్ఘ చర్చలు
- ◆ 2వ రోజూ ఉత్సాహంగా కొనసాగిన మహాసభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మహాసభల నేపథ్యంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చిన 400 మంది ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. అంతకు మునుపు కార్యదర్శి నివేదికలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రంలో మహిళల స్థితిగతులపై చర్చించారు. ప్రపంచ వ్యాప్తంగానూ మహిళలు అసమానతలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. 19 మిలియన్ బాలికలు యుద్ధాలు, చిన్న వయసులో వివాహాలు వంటి కారణాలతో విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. 85 కోట్ల మంది మహిళల రోజు వారి ఆదాయం వంద రూపాయల్లోపే ఉంటోందన్నారు. చట్టసభల్లోనూ స్త్రీ ప్రాతినిధ్యం తగ్గుతూ వస్తోందన్నారు. భారతదేశ పార్లమెంటులో స్త్రీల ప్రాతినిధ్యం 27 శాతం మాత్రమే ఉందని వివరించారు. ప్రతి ముగ్గురు మహిళల్లో ఒక్కరు జీవితకాలంలో హింసను ఎదుర్కొనక తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అసమనాతల్లో నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక కంటే భారత దేశం దిగువన ఉందని చెప్పారు. రాష్ట్రంలోనూ మహిళలపై హింస పెరుగుతోందన్నారు. కనీస వేతనాలు అమలు జరగలేదని చెప్పారు. మద్యం ఏరులై పారిస్తున్నారన్నారు. మద్యం అమ్మకాల్లో బెల్ట్‌షాపుల ద్వారా గ్రామాగ్రామానిక మద్యం చేరుస్తున్నారన్నారు. మైక్రో ఫైనాన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు.

సుదీర్ఘ చర్చలు

కార్యదర్శి నివేదికపై అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. అన్ని జిల్లాల్లోనూ మహిళలు పెద్దఎత్తున సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రధానంగా మైక్రో ఫైనాన్స్ భారినపడిన వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. మద్యం వల్ల నష్టపోతున్న వారు అధికంగా ఉన్నారన్నారు. ఈ సమస్యలపై ఐద్వాగా చేపట్టిన కార్యక్రమాలను అందులో సాధించిన విజయాలను తెలియజేశారు.

మహిళల హక్కులపై మరింత ఉద్యమించాలి
ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే

మనువాదం ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో మహిళలను జాగృతం చేసి వారి హక్కులను కాపాడటం కోసం ఐద్వా మరింతగా పనిచేయాలని ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే పిలుపునిచ్చారు. మహాసభకు హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే ప్రసంగించారు. రాష్ట్రంలో గడిచిన మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో ఐద్వా చేసిన కృషిని అభినందించారు. ఇదే సందర్భంలో ఈ కృషి ఇంకా సరిపోదని పేర్కొన్నారు. ఐద్వాను మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఒకవైపు దేశంలో బిజెపి మతోన్మాదం పెరుగుతుండగా, మనువాదం అమలు చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు. మనువాదం అమలు చేయడమంటే మహిళల హక్కులను హరించివేడయమే అవుతుందని పేర్కొన్నారు. ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం కూడా బిజెపితో కలిసి పనిచేస్తున్న క్రమంలో మరింతగా అప్రమత్తమై ప్రజలను ఐక్యపరిచే విధంగా ఐద్వా కృషి ఉండాలన్నారు. రాష్ట్రంలోనూ అనేక సమస్యలతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా మైక్రో ఫైనాన్స్ వల్ల బాధితులుగా మారుతున్న వారిలో మహిళలు అధికంగా ఉన్నారన్నారు. బాధితుల పక్షాన నిలిచి వారికి అండగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో సంఘం విస్తరణకు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న 'అమ్మకు పట్టాభిషేకం' నాటిక

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల రెండో రోజు ప్రతినిధుల సభలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లలితకళాపరిషత్ సమర్పణలో దర్శకులు అరుణ్‌బాబు నేతృత్వంలో 'అమ్మకు పట్టాభిషేకం' నాటికను ఎస్‌వి.డిగ్రీ కళాశాల విద్యార్థినులతో నిర్వహించారు. ఈ నాటిక సభికులను ఆకట్టుకుంది. తన బిడ్డ భవిష్యత్ కోసం సర్వం త్యాగం చేసిన ఒక తల్లి.. ఆ తల్లి ఆశయం నెరవేర్చడం కోసం ఆకాశమే హద్దుగా శ్రమించి అమ్మ కలను నెరవేర్చిన కూతూరు.. ఇతివృత్తంతో తల్లీకూతూళ్ల కష్టాలు, పోరాటం.. విజయాన్ని కళ్లకు కట్టినట్లు ఈ నాటిక ద్వారా ప్రదర్శించారు. ఆద్యంతం ఈ నాటికి సభికలను విశేషంగా ఆకట్టుకుంది. నాటిక రచించి, దర్శకత్వం వహించిన అరుణ్‌బాబు, సంగీత దర్శకులు నందకుమార్, నటించిన ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులు, లలితకళాపరిషత్ సమర్పకులకు ప్రతినిధులు అభినందనలు తెలిపారు. రైల్వే పాఠశాల గుంతకల్ విద్యార్థినులు మహిళా చైతన్యం పెంపొందించేలా చేసిన ప్రదర్శన, ఆయా జిల్లాల నుంచి నుంచి మహాసభకు వచ్చిన ప్రతినిధులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలూ అలరించాయి.



పుస్తకావిష్కరణ సందర్భంగా మాట్లాడుతున్న రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

ఆధునిక భారతదేశాన్ని నిర్మించుకుందాం

'ఎక్కడమ్మ నీవు లేనిది' పుస్తకం ఆవిష్కరణలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాన హక్కులు.. సమాన జీనవం ఉండే ఆధునిక భారతదేశ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు ఎంకెఎం ఫంక్షన్ హాల్‌లో రెండో రోజు కొనసాగాయి. ప్రతినిధుల సభలో రచయితలు, కవులు రాసిన కథలు, కవితలతో రూపొందించిన పుస్తకాలను కేరళ మాజీ మంత్రి శ్రీమతి టీచర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. డాక్టర్ ప్రగతి అధ్యక్షతన నిర్వహించిన కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి కేరళ రాష్ట్రం మాజీ మంత్రి శ్రీమతి టీచర్, ప్రజాకవి ఏలూరి ఎంగన్న, రచయితలు జూటూరి షరీఫ్, నర్శిరెడ్డి, వర్ధిని, ఐద్వా అఖిల భారత కార్యదర్శి మరియం దావలె, జాతీయ కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఎక్కడమ్మ నీవు లేనిది' కవితా సంపూటి రూపకర్త ఆచార్య రాచాపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్ర తిరగరాస్తుందని ఏళ్ల నాటి క్రితం గురజాడ అప్పారావు చాటి చెప్పారని గుర్తు చేశారు. ఆ దిశగా మహిళా లోకం పయనిస్తుండం ఆదర్శనీయం అన్నారు. అవాకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లోనూ ఇప్పుడిప్పుడే మహిళలు ముందుకెళ్తున్న నేపథ్యంలో అంతే వేగంగా వారు అణచివేతకు గురవుతుండడం బాధాకరం అన్నారు. స్త్రీలపై పురుషుల ఆధిక్యత తగ్గాలన్నారు. రాచరికం భూస్వామ్య వ్యవస్థలో కూడా స్త్రీలను హత్య చేయలేదని, ఆధునిక సమాజంలో స్త్రీని హత్య చేస్తుండటం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. రచయితలు, కళాకారులు, మేధావులు దేశం బాగుండాలని కోరుకుంటారన్నారు. వారి కళలు, సాహిత్యాల ద్వారా సమాజానికి చైతన్యాన్ని పెంపొందిస్తారని తెలిపారు. 'ఎక్కడమ్మా నీవులేనిది' కవిత సంపూటి తీసుకురావడానికి వందల మంది రచయితలు, కవులు రచనలు, కథలు పంపిచి సహకరించారని తెలిపారు. సమసమాజ స్థాపన, సుస్థిరత సాధించే వరకు ఐద్వా వంటి సంఘాలు ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమాలకు రచయితలు, కవులు, కళాకారులు తమ వంతు సహకారం అందిస్తారని తెలిపారు.

పంట నమోదు చేయించుకోండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పంటలుసాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు గోవిందంపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వరిపంటలను వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు నమోదు చేసిన పంటలను సూపర్ చెక్ చేశారు. తర్వాత రైతుల ఖాతా, సర్వే నెంబర్, పంట వేసిన తేదీ, విస్తీర్ణాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోవిందంపల్లి రైతులతో మాట్లాడుతూ రైతులందరూ పంట నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్, రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జిలు విజయశాంతి, తిరుమలేష్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అడుగులు పడుతున్నామని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని కందిగోపుల గ్రామంలో జెసి నాగిరెడ్డి తాగునీటి పథకాన్ని పున:ప్రారంభించారు. అనంతరం చింతకుంటలో తాగునీటి వాటర్ ప్లాంట్, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిన జెసి నాగిరెడ్డి తాగునీటి పథకాన్ని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తిరిగి ప్రారంభించామన్నారు. ఇచ్చిన మాట కంటే 10 రోజులు ముందుగా సుబ్బరాయసాగర్‌కు సాగునీరు విడుదల చేశామన్నారు. అలాగే వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యంతో తుప్పుపట్టిపోయిన మిడ్ పెన్నార్ యంత్రాల మరమ్మతులతోపాటు కాలువల ఆధునీకరణకు రూ.5.25 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. గండికోట, పుట్లూరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు ప్రతిపాదనలు పంపామని త్వరలో నిధులు విడుదలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం చింతకుంటకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి మినీగోకులం షెడ్డుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, డిప్యూటీ తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఎపిడి రంగారెడ్డి, ఎంఇఒ శ్రీదేవి, ఎఒ కాత్యాయని, కందికాపుల సర్పంచు శివరామయ్య, టిడిపి నాయకులు ఎల్‌కె చిన్నారెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, బాలాపురం ఓబుళనాయుడు, కడవకల్లు గోవర్ధనరాజు, గోప్రాసపల్లి రవికుమార్, బాలాపురం రామచంద్రారెడ్డి, ఓబులాపురం ప్రసాద్, వేణు, రామునిరెడ్డి, వాసుదేవరెడ్డి, శివారెడ్డి, బ్రహ్మయ్య, రామచంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సహకారంతో సుందర తాడిపత్రికి కృషి

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి



ప్రజాశక్తి తాడిపత్రి

మహిళలు, యువతుల సహకారం, అంకితభావంతో తాడిపత్రి మున్సిపాలిటీని మరింత సుందరంగా, స్వచ్ఛంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాడిపత్రి పట్టణ గృహిణుల సహకారంతో అభివృద్ధి చెంది రాష్ట్రంలోని తాడిపత్రిని రాష్ట్రంలో ముందు వరుసలో నిలబడుతోందన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో తీవ్రమైన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ క్రమంగా కుప్పకూలిపోవడం ప్రజలకు తగిన అవగాహన లేకపోవడమే అన్నారు. మహిళలు తమ ఇళ్లలోని నీటిని డ్రెయినేజీలోకి వదలడం వల్ల పూర్తిగా బ్లాక్ అయ్యి దుర్వాసన వస్తోందన్నారు. మురికి నీరు రోడ్లపై పొంగి పొర్లుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల్లో క్రమశిక్షణ లేకుంటే పిల్లలు, భవిష్యత్తు తరాలు బతకడం కష్టతరమౌతుందన్నారు. పట్టణ మహిళలతో త్వరలో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 15 రోజులకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు డ్రెయినేజీ వ్యవస్థపై అవగాహన కల్పిస్తామన్నారు. అండర్ డ్రెయినేజీలోకి నీటిలో కరిగే వస్తువులు మాత్రమే వెళ్లాలన్నారు. ప్లాస్టిక్ గ్లాసు, లోహపు వస్తువులు వేయకూడదన్నారు. చెత్తను సరైన పద్ధతిలో పారవేయాలన్నారు. మీశక్తితో మీ అంకింతభావంతో తాడిపత్రిని మరింత సుందరంగా మారుద్దామని పిలుపునిచ్చారు. తాడిపత్రి మార్పు కోసం కృషి చేయాలకున్న సెల్ 94411 45966, 91774 33002, 91541 18711 నెంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

'గూగుల్' రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

టిడిపి జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

విశాఖపట్నంలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన గూగుల్ సంస్థ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడం రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్ అన్నారు. మంగళవారం అనంతపురంలోని జిల్లా కార్యాలయంలో ఎంపి లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యంగెస్ట్ స్టేట్‌గా ఉన్న నవ్యాంధ్రప్రదేశ్ ఇప్పుడు దేశంలో హై ఇన్వెస్ట్‌మెంట్ స్టేట్ గా నిలుస్తుందనడంలో గర్వంగా ఉందన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారన్నారు. దాదాపు 12 నెలలు పాటు శ్రమించి, జాతీయ పాలసీల్లో కూడా మార్పులు చేయించి, 2 లక్షల మందికి ఉపాధి కల్పించి, రూ.1.33 పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడం సంతోషకరమన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ కేవలం మాటలకే పరిమితం చేయకుండా శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలు వైసిపికి బుద్ధి చెప్పినా కూడా వారి సైకో చేష్టలు మానుకోకుండా రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడటం నిజంగా పనికిమాలిన చర్య అని ఎద్దేవా చేశారు. వారి స్కాంలు డైవర్ట్ చేయడానికి ఇప్పుడు తప్పుడు మార్గాలు ఎంచుకుని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎపి రాష్ట్ర ఆరెకటిక ఫెడరేషన్ ఛైర్మన్ హరికృష్ణారావు, ఎపి రాష్ట్ర కురుబ సాధికార సమితి సభ్యులు కురుబ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీకి అధిక ప్రాధాన్యత

జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం టెక్నాలజీస్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తోందని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. మంగళవారం అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో అడ్వంట్ గ్లోబల్ ఫౌండేషన్ క్వ క్లెయిరావోయాన్స్, అనంతపురం జెఎన్‌టియు సంయుక్తంగా రెండు రోజుల ఫాకల్టీ ఆఫ్ స్కిలింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. మొదటి రోజు పలు క్వాంటం టెక్నాలజీ అంశాలపై దివ్యాన్ష్ శ్రినాలి ప్రాజెక్టు ఇంజినీర్ సి-డాక్, ఆర్కా ముఖర్జీ టీం లీడర్ సీ-డాట్ అవగాహన కల్పించారు. అనంతరం విసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న క్వాంటం టెక్నాలజీస్‌లో ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు పరిపూర్ణమైన అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్లుగా కె.మాధవి, రాజశేఖర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, వర్సిటీ అకాడమీక్ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్‌వి సత్యనారాయణ, డైరెక్టర్ ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్, ఇంకుబేషన్ సెంటర్ సి.శోభాబిందు, ఒఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, అడ్వంట్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ భరతిపూడి, కిషోర్, రాజగోపాల్, తదితరులు

గౌరవం లేని సభలో మేమెందుకు కూర్చోవాలి.?

అధికారులను నిలదీసిన ఎంపిటిసిలు



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సర్వసభ్య సమావేశానికి రావాలని సరైన ఆహ్వానం పంపకుండా అగౌరవ పరిచినప్పుడు తామెందుకు సమావేశంలో కూర్చోవాలని పలువురు ఎంపిటిసిలు నిలదీశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మారుతమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఎంపిపి కార్యాలయంలో వైస్ ఎంపిపి కాంతమ్మ, ఎంపిటిసిలు నరసింహులు, ఓబుళపతి, కోఆప్షన్‌మెంబర్లు అబ్దుల్ రెహమాన్, ఎంపిడిఒ ధనుంజయ, ఎఒ శివశంకర్‌లతో మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి జారీ చేసిన సర్క్యులర్‌లో ఎంపిటిసిలకు ఆహ్వానం పంపినట్లు పొందుపరచకపోవడం బాధాకరమన్నారు. ఇంతవరకు గౌరవవేతనం కూడా అందలేదన్నారు. పదవీకాలం ముగుస్తున్న ఇలాంటి పరిస్థితులను చోటు చేసుకుంటుంటే ఎందుకు సమావేశంలో పాల్గొనాలని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పినా సంతృప్తి చెందలేదు. దీంతో సమావేశం నుంచి వెంటనే వారు బయటకు వెళ్లిపోయారు. సర్పంచులు కూడా ముగ్గురికి మించి హాజరుకాలేదు. వివిధ శాఖల అధికారులు వారి నివేదికలను చదివి వినిపించి తూతూ మంత్రంగా సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా పెండింగ్ పనులు పూర్తి చేయండి

ఎమ్మెల్యే పరిటాల సునీత



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-రాప్తాడు

వచ్చే డిసెంబర్‌లోగా పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ ఇఇలు, డిఇలు, ఎఇలతో సమీక్ష నిర్వహించి బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, గ్రామ సచివాలయాల నిర్మాణాలపై చర్చించారు. అలాగే ప్రపంచబ్యాంకు, నాబార్డ్, ఎన్‌ఆర్‌ఇజిఎస్, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో జరుగుతున్న పనుల పురోగతిపై ఆరాతీశారు. ముఖ్యంగా పిఆర్ విభాగం పరిధిలో రూ.11 కోట్లతో 22 బీటీ రోడ్లు నిర్మిస్తుండగా రూ.6కోట్ల పనులు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. అలాగే రూ.22.80 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టగా.. దాదాపు 98శాతం వరకు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. ఇవికాక కొత్తగా రూ.3.19కోట్లతో సీసీ రోడ్లకు నిధులు మంజురు కాగా ఆయా పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. వాటితో పాటు మిగిలిన వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల గురించి ఎమ్మెల్యే ఆరాతీశారు. మొత్తం 18పెండింగ్ లో ఉన్నాయని చెప్పగా.. వాటిని త్వరితగతిన పూర్తి చేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వీటితోపాటు ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవ కింద 5విలేజ్ హెల్త్ క్లినిక్ లు నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. ఒక్కొక్క క్లినిక్ 42లక్షలతో నిర్మిస్తున్నట్టు వివరించారు. 15వ ఫైనాన్స్ కింద అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు పరిధిలో 7, శ్రీసత్యసాయి జిల్లాలో రెండు క్లినిక్‌లను రూ.36 లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని వేపకుంట, కోనాపురం, నరసంపల్లి గ్రామాల్లో మూడు కొత్త సచివాలయాలు ఒక్కొక్కటి రూ.32 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇక నాబార్డ్ నిధులతో అమిదాలకుంట రోడ్డు రూ.2.35 కోట్లతో ఆరు కిలోమీటర్లు మేర చేపట్టినట్టు చెప్పారు. కామారుపల్లి రోడ్డు 1.9 కిలోమీటర్లు రూ.80లక్షలతో నిర్మిస్తున్నట్లు వివరించారు. ఆయా పనులను వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

పాపంపేట భూ ఆక్రమణలపై విచారణ చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



విచారణ చేస్తున్న సిపిఎం నాయకులు

అనంతపురం రూరల్ మండలం పాపంపేట పంచాయతీలో అక్రమ జిపిలు చేయించుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పాపంపేటలో జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్పతో కలిసి సిపిఎం నాయకుల బృందం పర్యటించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వి.రాంభూపాల్ మాట్లాడుతూ పాపంపేట గ్రామస్తులు, భూమి యజమానులు, ఈనాం భూములపై జరుగుతున్న ఆక్రమణలు, వస్తున్న వార్తలు, భయకంపితులను చేస్తున్న ప్రకటనల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆయా భూములపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వి నాయుడు, నగర కమిటీ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, బుల్లే రాజు, రజక వృత్తిదారుల సంఘం నాయకులు రామాంజి పాల్గొన్నారు.

గుండెపోటుతో టిడిపి సీనియర్ కార్యకర్త మృతి



కృష్ణమూర్తి

శింగనమల : మండల కేంద్రంలోని టిడిపి సీనియర్ కార్యకర్త బెస్త కృష్ణమూర్తి (55) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో పలువురు నాయకులు నివాళు లర్పించారు. శింగనమలకు చెందిన కృష్ణమూర్తి టిడిపి ఆవిర్భావం నుంచి చురుగ్గా పని చేసేవాడు. అంతేగాకుండా యానిమేటర్‌గా పని చేసి అందరి మన్ననలు పొందాడు. కృష్ణమూర్తికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఆయన మృతితో కుటుంబం విషాదంలో మునిగింది. కాగా వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాల్సిందే..

అనంతపురం సిటీ : రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టుకు ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే పునరుద్ధరించాల్సిందేనని ఎబిఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతూ నగరంలోని కలెక్టరేట్ ముందు భారతీయ భీమసేన ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష మంగళవారానికి రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షకు మద్దతు తెలిపిన ఆయన మాట్లాడుతూ నిరాహార దీక్ష చేపట్టి రెండు రోజులు అవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఎఫ్సిఆర్‌ఎపై స్పష్టమైన ప్రకటన చేసి ఆమరణ దీక్షను విరమింపజేయాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేయండి

ప్రజాశక్తి-రాయదుర్గం

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరణ చేయాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్.రవిశంకర్‌రెడ్డి కోరారు. మంగళవారం రాయదుర్గం తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా రాయదుర్గంలో పోలింగ్ కేంద్రం ఒకటో.. ఓటర్ల నివాసం మరోచోట దూరంగా ఉన్నట్లుగా పలువురు నాయకులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఇఆర్ఒ సమాధానం ఇస్తూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రం ఓటరు నివాసానికి గరిష్ఠంగా రెండు కిలోమీటర్ల లోపల ఉండాలన్నారు. ఎక్కడైనా దూరంగా ఉన్నట్లు తెలిపితే సమీక్షించి పోలింగ్ కేంద్రం మార్పేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతోపాటు పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాతాదేవి, డిప్యూటీ తహశీల్దార్ రఘు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-నార్పల



మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన ఎంపిడిఒ మమతాదేవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ముందుగా మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు, పంచాయితీల వారీగా ప్రాధాన్యత క్రమంగా ఆ నిధులను పంపిణీపై ఎంపిడిఒ వివరించారు. అనంతరం జడ్పిటిసి నాగరత్నమ్మ మాట్లాడుతూ ఎంతోమంది నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపిన ఆర్‌డిటి సంస్థకు విదేశీ నిధులను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం వారి వారి శాఖలకు సంబంధించిన ప్రగతి, పథకాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, తహశీల్దార్ అరుణకుమారి, డిప్యూటీ తహశీల్దార్ శైలజారాణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శేషారెడ్డి, ఎంఇఒ కృష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్, పిఆర్ ఇంజినీర్ రమణయ్య, మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి, హౌసింగ్ డిఇ కృష్ణమూర్తి, మండల ఉద్యాన అధికారి నెట్టికంటయ్య, వెటర్నరీ డాక్టర్ సాయిసుప్రజ, సిహెచ్ఒ బాలాజీ, సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎపిఒలు రమేష్ రామారావు, ఎర్రమ్మ, ఎపిఎం తిప్పమ్మ, హాస్టల్ వార్డెన్లు శాంతకుమారి, శ్రీలక్ష్మి, ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌ఛార్జి మూర్తి, ఎంపిడిఒ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శేషారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుభాన్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, రాజారెడ్డి, కాటమయ్య, పద్మాకర్‌రెడ్డి, సర్పంచులు రామాంజనేయులు, రాంభూపాల్‌రెడ్డి, కుల్లాయిరెడ్డి, రమణకుమారి, నాగార్జున, కుల్లాయప్ప, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, శ్రీనివాసులు, పరశురాం, వెంకటరమణ, గోపాల్‌రెడ్డి, కుళ్లాయిస్వామి, బాలచంద్రారెడ్డి, లక్ష్మీదేవి, కీర్తన, వరలక్ష్మి, రాజేశ్వరి, కుళ్లాయప్ప, మల్లికార్జున, శ్రీనాథ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖలో మంగళవారం ఎపిఎన్‌జిఒ సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, రమణారెడ్డి, పద్మావతి, రాజగోపాల్, వీరేష్‌బాబు, సల్మా, హఫీజ్, శ్రీనివాసులు, పరిపాలనాధికారి మునీర్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ



గంబూషియా చేపలను వదులుతున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-గుత్తి

చెరువులు, నీటికుంటలు, బావుల్లోకి గంబుషియా చేపల వదలడం వల్ల దోమలను నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్, ఆరోగ్య కార్యకర్త ఆంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని వక్కలకుంట, బండగేరిలోని బావులు, మండలంలోని ఊబిచెర్ల, రజాపురం గ్రామాల్లోని చెరువులు, కుంటలు, బావుల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది దోమల నివారణకు గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల నివారణకు దోమ, గుడ్డు, లార్వాదశలను నిర్మూలించేందుకు గంబూషియా చేపలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలకు దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రజలందరూ నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే, డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు రబియా, రూప, నాగవేణి, రోజా, మాధవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

పొగాకు నియంత్రణ జిల్లా సోషల్ వర్కర్ బోయ శ్రీరాములు



పొగాకుపై అవగాహన కల్పిస్తున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పొగాకు నియంత్రణ జిల్లా సోషల్ వర్కర్ బోయ శ్రీరాములు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పంతులవారి కాలనీ, రుద్రంపేట-2, అంగన్వాడీ సెంటర్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో పొగాకుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా సిగరెట్టు, ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ క్యాన్సర్ వంటి భయానిక వ్యాధులు రాకుండా నివారించుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల పరిధిలోని దుకాణాల్లో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రుద్రంపేట సచివాలయం-2 ఆరోగ్య సిబ్బంది, పిహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్, ఎఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివప్రసాద్ నేత్రదానం

నార్పల : మండల కేంద్రానికి చెందిన కొండిశెట్టి శివప్రసాద్ కుటుంబ సభ్యులు నేత్రాలు దానం చేశారు. సోమవారం బుక్కరాయసముద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శివప్రసాద్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మరొకరికి చూపు ప్రసాధించాలనే మానవతా దృక్పథంతో నేత్రాలు దానం చేశారు. ఆయన నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది నేత్రాలను స్వీకరించారు. శోకసంద్రంలో ఉన్నప్పటికీ ఆయన సతీమణి లక్ష్మీదేవి చేసిన ధాతృత్వాన్ని పలువురు కొనియాడారు.

మొక్కజొన్నలో పంటకోత ప్రయోగం

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో రైతులు ఎన్.సులోచనారెడ్డి, ఎం.దివాకర్‌రెడ్డి పొలంలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పంటకోత ప్రయోగం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కాత్యాయని, వ్యవసాయ విస్తరణ అధికారి చిన్న నాగిరెడ్డి, ఎంపిఇఒ సుధా రామకృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జీఎస్టీపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీసాయి క్యాంపస్ సిఇఒ ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వరూప, వినోద్, అధ్యాపకులు రంగస్వామిరెడ్డి, మస్తాన్‌వలి, పిఇటి రవికుమార్, యాగంటీశ్వరుడు, సుధాకర్‌రెడ్డి, నాగ విశాల ఆఫ్రిన్ తాజ్, రేష్మ, షాను, కౌషర్, సావిత్రి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుపై దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎంఎస్సీ బయో కెమిస్ట్రీ, ఎంఎస్సీ మైక్రో బయాలజీ, ఎంబిబిఎస్ విద్యార్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు. ఈనెల 16వతేదీ గురువారం సాయంత్రంలోపు తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని కోరారు.

రాంపుల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

యాడికి : మండల పరిధిలోని చింతలాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఆదానీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రాంపులయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో విధులు నిర్వహించే చింతలాయపల్లికి చెందిన రాంపుల్లయ్య సోమవారం విధులకు వెళ్లి మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న తాడిపత్రి నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు ఎంపి పుల్లయ్య, యాడికి మండల ఎంఆర్‌పిఎస్ నాయకులతో కలిసి మంగళవారం రాంపుల్లయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంపుల్లయ్య ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తూ మరణించిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు జి నరసింహులు, సూర్యుడు, కుళ్లాయప్ప, రామాంజనేయులు, చిన్న రాముడు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

'గూగుల్ రాకతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి : విప్

రాయదుర్గం : గూగుల్ క్లౌడ్ సంస్థ రాక రాష్ట్ర అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని విప్ కాలవ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఎపి అత్యధిక పెట్టుబడులను ఆకర్షించే రాష్ట్రంగా ఎదుగుతోందన్నారు. గత 12 నెలలుగా పట్టుదలతో కృషి చేసి నేషనల్ పాలసీల్లో మార్పులు చేయించి, 2 లక్షల మందికి ఉపాధి కల్పించే రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయమన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు, అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా మారనుందన్నారు.

అందరినీ ఆరోగ్యవంతులను చేద్దాం

కళ్యాణదుర్గం టౌన్ : అందరినీ ఆరోగ్యవంతులుగా తయారు చేయడమే కర్తవ్యంగా పని చేయాలని నేషనల్ హెల్త్‌మిషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కిషోర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో ఎన్‌హెచ్‌ఎం బృందం పర్యటించి ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెల్త్ సెంటర్‌లో సర్పంచు శోభారాణి, ఎన్‌హెచ్‌ఎం డేటా మేనేజర్ జరీనా, డీపీహెచ్‌ఎన్‌ఒ ప్రమీళాదేవి, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు భార్గవి, భారతి, శ్రావణి, ఆరోగ్య కార్యకర్తలు సరోజ, సుశీలలతో ఆరోగ్య స్థితిగతులపై సమీక్షించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని వర్గాల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన గ్రామాన్ని తీర్చిదిద్దిన్న వారవుతామన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

రాయదుర్గంరూరల్ : అధ్యాపకులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ కళాశాల అభివృద్ధికి తోడ్పడుదామని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశా ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. గతంలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన లక్ష్మీనారాయణ మెడికల్ లీవ్‌లో వెళ్లారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులును అధ్యాపక బృందం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

బెలుగుప్ప : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బిఐ మేనేజర్ నాగ సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంకు కార్యాలయంలో ఖాతాదారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సేవలతోపాటు ఖాతాదారులకు భద్రత సేవలు గురించి వివరించారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్లు మీకు ఫోన్ చేసి మీ అకౌంట్ నుంచి డబ్బులు కాజేస్తే వెంటనే 1930కి కాల్ చేస్తే వెంటనే లాక్ చేయడానికి వీలుంటుందన్నారు. కాగా బ్యాంకులు పదివేల మంది ఖాతాదారులు ఉండగా 450 మందికి రైతులకు క్రాప్‌లోన్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఆదినారాయణ, క్యాషియర్ ఎర్రిస్వామి, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించాలనే కూటమి కుట్రలకు చెక్ పెట్టేందుకే వైసిపి రచ్చబండ-కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని చేపట్టిందని మాజీమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని మడ్డిపల్లి, మడుగుపల్లి, జంగంరెడ్డిపల్లి, ఎల్లుట్ల గ్రామాల్లో వైసిపి నేతలు, కార్యకర్తలతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వైద్య వ్యవస్థను ప్రయివేట్ చేతుల్లోకి వెళ్లనివ్వకూడదన్నారు. ఇందుకోసమే కోటి సంతకాల సేకరణ చేపట్టామన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండకట్టాలన్నారు. అధికారం కోసం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇచ్చిన హామీలను అరకొరగా నెరవేర్చుతూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కలిసికట్టుగా పని చేసి రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఎంపీపీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కబ్జాదారులకు అండగా నిలవడం బాధాకరం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మండల పరిధిలోని చెదుళ్ల గ్రామానికి చెందిన భూ కబ్జాదారులకు మాజీమంత్రి శైలజానాథ్ అండగా నిలుస్తూ ప్రోత్సహించడం బాధాకరమని ఆ గ్రామ టిడిపి నాయకులు నారాయణస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ చెదుళ్ల గ్రామానికి చెందిన నాగేశ్వరమ్మ, పార్వతి తల్లిదండ్రులకు చెందిన భూమిని వన్నూరప్ప ఆక్రమించి ఆన్‌లైన్‌లో ఎక్కించడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి శైలజానాథ్‌తో కలిసి బెదిరింపులకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. బాధితులకు పట్టాదారు పాసు బుక్కు, డీ పట్టా ఉన్నా అక్రమార్కులకు వత్తాసు పలకడం ఏంటని ప్రశ్నించారు. ఇదేగ్రామంలో సర్పంచు పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి వాటర్‌ప్లాంట్ నిర్మించినా, కొందరు వైసిపి నాయకులు ముస్లిముల శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించినా, పంచాయతీ స్థలంలో ఇల్లు నిర్మించినా మాజీ మంత్రి నోరు మెదపడం లేదన్నారు. ఇప్పటికైనా శైలజానాథ్ నిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

రంగుమారిన ధాన్యం వేలం

ప్రజాశక్తి-కణేకల్లు

మండల కేంద్రంలోని సహాయ వ్యవసాయ సంచాలకుల వ్యవసాయ క్షేత్రంలో 2024-25 రబీ సీజన్‌లో పండించిన పంటను ఎడిఎ నారాయణ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం వేలం వేశారు. రబీ సీజన్‌లో ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం వరిధాన్యం దాదాపు 145 క్వింటాళ్లు వేలం వేశారు. క్వింటా ధర రూ.1,550 చొప్పున విక్రయం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వేలంపాట వేస్తున్న అధికారులు

పరిశీలకుల నియామకం

ప్రజాశక్తి-నార్పల/యల్లనూరు/పుట్లూరు




మెడికల్ కళాశాలల ప్రవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాలకు పరిశీలకులను నియమిస్తూ వైసిపి అధినేత జగన్ ఉత్తర్వులు జారీ చేశారు. పుట్లూరు పరిశీలకులుగా నార్పల సత్యనారాయణరెడ్డి, నార్పల పరిశీలకులుగా యల్లనూరు జడ్పిటిసి బోగాతి విజయ ప్రతాప్‌రెడ్డి, యల్లనూరు పరిశీలకులుగా భూమిరెడ్డి రాఘవరెడ్డిని నియమించారు.

నేడు మండల సమావేశం

డి.హీరేహాళ్ : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దాసానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపిపి, జడ్పిటిసి, సర్పంచులు, ఎంపిటిసిలు, కో ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన సూర్యనాగశేఖర్

శింగనమల : మండల పరిధిలోని నాయనపల్లి క్రాస్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పుట్లూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన సూర్యనాగశేఖర్ (50) సొంత పని నిమిత్తం వచ్చి నాయనపల్లి క్రాస్ సమీపంలో ఓ టీకొట్టు వద్ద టీ తాగి రోడ్డు దాటుతుండగా తాడిపత్రి నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఒక్కసారిగా పైకి ఎగిరి కారుపై పడి దాదాపు 152 అడుగుల మేర ఈడ్చుకుంటూ వెళ్లింది. కారు డ్రైవర్ బ్రేక్ వేయడంతో కారు పైనుంచి కింది పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న శింగనమల సిఐ కౌలుట్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

మహిళకు గాయాలు

కళ్యాణదుర్గం టౌన్ : మండల పరిధిలోని శిబావి గ్రామం వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మతిస్థిమితంలేని మహిళకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు బాధితురాలిని కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. స్థానిక డాక్టర్లు వైద్యం చేశారు. ఔట్‌పోస్ట్ పోలీసులు కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.

మొక్కజొన్న పంట దగ్ధం

బెలుగుప్ప : మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు అనుమక్కకు చెందిన రెండెకరాల్లో మొక్కజొన్న పంట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంగళవారం దగ్ధమైంది. దీంతో దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేసింది. మొక్కజొన్నతోపాటు వాడే డ్రిప్‌వైర్లు కాలి బూడిదయ్యాయి.